2

# వెయ్యేళ్ళ ప్రస్థానం

**ఆ**యన వయసు, అధిక మాసాల్తో లెక్కేస్తే వంద ఉంటుందని అంతా అనుకుంటారు. ఆయన తరంవాళ్ళూ, ఆయన తర్వాత తరం వాళ్ళూ, ఆ గ్రామంలో ఎవరూ లేరు. అంతా టిక్కెట్టు పుచ్చుకుని ఎప్పుడో పై కెళ్ళిపోయారు.

ఆయనకో పేరుంది. అదెవరికీ పెద్దగా గుర్తుండదు. అందరికీ ఆయన తాతగారే.

ఒకప్పుడు ఎన్నో ఒడిదుడుకులని జిబ్రాల్టర్ రాక్ లా నుంచుని ఎదుర్కొన్నారు. ఆటుపోట్లకి తట్టుకున్నారు. ఇప్పుడు మాత్రం డొలక పువ్వులా ఉన్నారు. అందరూ పోవడంతో మనుమడు సింహాద్రి దగ్గరుంటున్నారు. ప్రస్తుతం ఆయన సుబ్రమణ్యంతో కబుర్లేసుకుంటున్నారు.

"ఏవిటో సుబ్రమణ్యం, ప్రతిరోజూ జరిగిపోయినదే గుర్తొస్తోంది. జ్ఞాపకాలని గుర్తు తెచ్చుకుంటున్నాం. అంటే, పెద్దవాడినయిపోయానని అర్థం. పెద్దవాళ్ళంటే అందరికీ బోరే. అవునా, కాదా, ఏవంటావ్?"

సుబ్రమణ్యం ఏం అనలేదు.

"పోనీ, ఓ పుస్తకం రాయనేంటీ? నాకు బోర్ కొట్టదు. నన్ను చూసేవాళ్ళకీ బోర్ కొట్టదు. ఆలోచన ఎలా ఉంది?"

"బావుంటుంది. పుస్తకం రాసేయండి..."

"అయితే గీతాంజలిని తెలుగులోకి అనువాదం చేస్తాను... ఏవంటావ్?"

"వొద్దు, తాతగారూ వొద్దండి. ఆ గీతాంజలిని ఇప్పటికే చాలామంది అనువాదం చేశారు. ఇంకేదయినా రాయండి..."

కాస్సేపు ఆలోచనలోపడి, ఆ తర్వాత ఉత్సాహంగా చిటికె వేసి, "అద్దీ..." అన్నారు.

"ఊరే... సుబ్బు... అదీ ఇదీ అనువాదం ఎందుకు? నా జీవితం రాసేస్తాను... వెయ్యేళ్ళ క్రితం మా పూర్వీకులు తంజావూరు నుంచి, రాజమహేంద్రవరం ఎలా వచ్చారో, ఎందుకు వచ్చారో రాస్తాను. రాజరాజ చోళుడు తన కూతురు అమ్మంగ దేవేరిని రాజరాజ నరేంద్రుడికిచ్చి పెళ్ళి చేశాక పద్దెనిమిది గోత్రాల వారు కావేరి తీరం నుంచి కాలి నడకన వచ్చిన వైనం, కొంతమంది ఎలా ఎక్కడ ఆగిపోయారో, కొంతమంది ఒరిస్సా విజయనగరం, విశాఖపట్నాలకి సముద్రం ద్వారా వెళ్ళిపోయినది, కొంతమంది ఎలా గోదావరిని చేరుకున్నది అన్నీ నాకు తెలిసినది రాస్తాను.

ఒరే సుబ్రమణ్యం, నీకు తెలీదు... నీకేంటీ... చాలా మందికి తెలీదు, రాజ కులైక భూషణుడు, రాజమనోహరుడు, చాళుక్య మన్మథుడు అంటూ రాజరాజుని కీర్తించి, శ్రీవాణీ గిరిజాశ్చిరాయా అనే శ్లోకంతో భారత రచన ఆరంభించిన నన్నయ భట్టు కూడా ద్రావిడ బ్రాహ్మణుడేమో... అని నా అనుమానం. ఎందుకంటే ఆయన కూడా మా పూర్వీకుల్లాగే తంజావూరు నుంచి వచ్చాడని విన్నానులే...

ఇంకా ఎన్నో ఎన్నో... ఈ కోనసీమ కరవులు, కాటను దొరగారి పుణ్యాన సస్యశ్యామల భూములు, పందొమ్మిది వందల యాభైమూడులో వచ్చిన వరదలు... ముక్తాబాయమ్మగారు ఈ ఊరు రావడం, జమీందారుగారింట ఉండి పిల్లలందరికీ దేశభక్తి పాటలు నేర్పించడం... ఇలా ఎన్నో ఉన్నాయి. ఇది రాస్తే బావుంటుంది ఎలా ఉంటుందోయ్ రాసే అంశం..." కళ్ళెగరేసి అడిగారు తాతగారు.

సుబ్రమణ్యానికి, ఆయన ఉత్సాహం చూసి ముచ్చటేసింది.

"చాలా బావుంది. అసలు పుస్తకం అంటే ఇలాగే ఉండాలి. ఏదో నేర్చుకున్నట్లుండాలి. మీరు చెప్పిన దాన్ని బట్టీ చూస్తే మీరు రాయబోయేదాన్లో చరిత్ర ఉంది, సంస్కృతి ఉంది, సాహిత్యం ఉంది. ఇలా పరస్పరాశ్రయాలతో ఉన్న సాహిత్యం కోసమే అకాడమీలు ఎదురు చూస్తుంటాయి. ప్రపంచానికి అందించాల్సిన సాహిత్యం కూడా ఇదే. రాయండి నా సహాయం మీకు ఎప్పుడూ ఉంటుంది... పోనీ మీరు చెప్తూంటే నేను రాస్తాను..."

"అబ్బే... అలా కుదర్దు. నేనే రాస్తాను. నేనే రాయాలి. నాకు నీ సహాయం ఏమిటి! అంతగా అవుతె, పూర్తి పుస్తకం రాత ప్రతి అయిపోయాక అచ్చేయించు... అది నువ్వే చెయ్యాలి... ఆ పనికి నువ్వు పూనుకోవాలి..."

ఆ తర్వాత ముని మనవరాలు పన్నెండేళ్ళ శిరీషని పిలిచారు. "అమ్మడూ.. తెల్లకాయితాలు, ఓ పెన్ను తీసుకురా... ఎక్కడుంది అని నన్నడక్కు మీ అమ్మనో, నాన్ననో అడిగితే సరి... వాళ్ళే చెబుతారు..."

ఆ తర్వాత వారం, వర్జ్యం చూసుకుని శ్రీరామ రక్ష, అవిఘ్నమస్తు అని రాసి, తన జీవిత చరిత్ర రాయడానికి మొదలెట్టారు తాతగారు.

"కొంచెం చూపు మందగిస్తోంది. ఈ బల్లని ఈ మండువా అంచున కాకుండా పెరట్లో వేయించు..." అని మనవడు సింహాద్రికి పురమాయించారు.

రోజు రోజుకి కాయితాలు అయిపోతున్నాయి. అమలాపురం వెళ్ళే వాళ్ళతో తెల్లకాయితాల కట్టలు తెప్పించుకున్నారు.

"తాతగారు, ఓసారి చదవనా, మీరేం రాశారో చూస్తాను" అన్నాడు సింహాద్రి.

"అలా బావోదు. మధ్యలో చదివితే మీకేం అర్థం కాదు. పైగా అదేవిటీ, ఇదేవిటీ అని ప్రశ్నలు వేస్తారు. మీకు జవాబులు ఇస్తూంటే నా రాయడం ఎప్పటికవుతుంది? అంతా పూర్తయ్యాకే ఒక్కసారి చదువుదురుగాని..."

సింహాద్రే కాదు, ఆ గ్రామంలోని వాళ్ళు చాలామంది తాతగారిని అడిగారు, 'ఓసారి చదివిస్తాం' అని, కానీ ఆయన ససేమిరా అన్నారు.

కంటి చూపు బాగా మందగించింది. కొన్నిసార్లు కళ్ళజోడు లేకుండా రాస్తున్నారు. కొన్నిసార్లు కళ్ళజోడు పెట్టుకొని రాస్తున్నారు. అయినా ఉత్సాహంగా పేజీలు నింపేస్తున్నారు.

"ఈ వయసులో ఏమిటిది. తాతగారు... వేళ్ళు నొప్పెడుతాయి..." అని ఊళ్ళో వాళ్ళు మందలిస్తే ఊరుకునే వారు కారు.

"వయసుకి, ఉత్సాహానికి సంబంధం చాలా ఉంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఉత్సాహం కూడా పెరగాలి. అంతేగానీ, ఈసురోమంటూ ఉండాలా ఏవిటీ? నేను వయసయిన వాడినేవిటీ! నాకు ముసలి తనం ఏవిటీ?..." అని కొట్టిపడేసేవారు.

ఈ లోపుగా సింహాద్రి భార్య సుభద్ర తండ్రికి మూడోసారి గుండెనొప్పి వచ్చిందని, కొబ్బరికాయల కొట్టు ఓనరు కొండబాబుకి ఫోన్ చేసి కబురు పంపారు.

సుభద్ర, సింహాద్రి పిల్లల్ని తీసుకుని బయల్దేరారు.

"పిల్లల్ని ఉంచేయండిరా... వాళ్ళ స్కూళ్ళు పోతాయి. పైగా మీ నాన్నగారి పరిస్థితి చూసి పిల్లలు బెంబేలెత్తిపోతారు. నా దగ్గర అట్టే ఉంచేయమ్మా..."

"మీరే పెద్దవారు. మీరేం చూస్తారు? అసలు మీది మీరే చేసుకోగలరో లేదో... అది చూసుకోండి..." అంది సుభద్ర.

తాతగారు బాధ పడ్డారు.

అంత పెద్ద యింట్లో ఒక్కరు అయిపోయారు.

ఊళ్ళో వాళ్ళంతా తాతగార్ని తీసుకెళ్ళి వాళ్ళ ఇళ్ళల్లో గుప్పెడు మెతుకులు పెట్టడానికి సిద్ధం అయ్యారు. కానీ ఆయన ఒప్పుకోలేదు. ఎవరికీ భారం తాకట్టుకోలేదు. చేతిలో డబ్బు అయిపోతోంది... ఎవరిని అడగడానికి ఇష్టపళ్ళేదు.

ఏదో గుర్తొచ్చినట్టుగా లేచి, పాతకాలం గాజుతలుపులున్న నల్లచెక్క అలమార తాళం తీసి, తన అనుభవాల్ని, జ్ఞాపకాలని, ఆలోచనలని, మనసుని, హృదయాన్ని అక్షర రూపంలో ఉన్న కాయితాల్ని తీసి బొత్తిపెట్టి వీధి అరుగుమీదకి వచ్చారు. అప్పుడే సింహాద్రి కోడలు రాజ్యం ఎక్కడికో పెత్తనానికి బయల్దేరినట్లుగా ఉంది.

ఎందుకంటే, మధ్యాహ్నం వేళ టీలు అయ్యాక ఎవరో ఒక యింటి అరుగుమీద కూచుని ఆడాళ్ళంతా కవుర్లాడుకుంటారు.

"అమ్మడూ... రాజ్యంవా... ఓ సారిల్లారా..."

ఆమె అయిష్టంగా వచ్చింది.

"విస్సినాధం ఇంటివైపు వెళ్తున్నావు లావుంది. దార్లో సుబ్బరమణ్యానికి నేను కేకేస్తున్నానని చెప్తావా..."

ఆమె మొహం చూశారు.

"పోనీలే తల్లీ... నీ పని నువ్వు చూసుకో... నేనే వెళ్తాను. నా కాళ్ళల్లో ఇంకా బలం ఉందిలే..."

ఆమె సిగ్గుపడింది.

"అబ్బే... నే వెళ్తానులెండి తాతగారు. మీరు కేకేస్తున్నారని చెప్తాను..."

సుబ్రమణ్యం వచ్చాడు.

"ఇదిగో... సుబ్బా.. ఇప్పుడు నీ సాయం కావాలి..." అంటూ కాయితాల బొత్తిని సుబ్రమణ్యం చేతికిచ్చారు.

"రాజమండ్రి కోటగుమ్మం దగ్గర అచ్చేసే కంపెనీ ఉండేది. అది ఉప్పుడుందో లేదో తెలీదనుకో. ఓ సారి ఈ బొత్తిని వాళ్ళకి చూపించేసి, వాళ్ళేమంటారో కనుక్కుని ఏ కవురూ నాకు చెప్పు. బావుందని అంటే పిల్లల్ని తీసుకొచ్చేస్తాను. నేను వాళ్ళని చూసుకుంటాను. వాళ్ళేదో డబ్బిస్తారు కదా... అవునూ... ఈ మధ్య కోర్టుకెళ్టం లేదని విన్నాను... నిజమే?"

సుబ్రమణ్యం ఏం మాట్లాడలేదు. కోర్టుకి వెళ్టం లేదన్న సంగతి తాతగారు కనిపెట్టేశారు.

"సుబ్బా! నీకు తెలిసిందే అనుకో. మళ్ళా చెప్తున్నాను. అన్ని జన్మల్లోకి మానవ జన్మ గొప్పది. వచ్చే జన్మలో మనం మానవులుగా పుడ్తామో లేదో మనకేం తెలీదు కదా! అమెరికాలో పోయిన కొడుకు, మతి స్థిమితంలేని భార్య గురించి ఆలోచించి

ఆలోచించి తాగుడికి అలవాటుపడి ప్రాక్టీసు కూడా మానేసుకునే స్థితికి వచ్చావు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఇంకా మిగిలిపోయిన జీవితంలో మనిషిగా చేయాల్సింది చెయ్యి అయిపోయిన దాని గురించి ఎందుకు? రాబోయే జీవితంలోని ప్రతీక్షణం జీవించడానికి ప్రయత్నించు. అది కూడా ఉత్సాహంగా ఏ పనీ లేకపోతే కల్పించుకో. నిండా యాభై ఏళ్ళు కూడా లేవు. నువ్వేలా ఉన్నావూ? నేనెలా ఉన్నానూ! వయసయిపోయిందని ఎప్పుడూ అనుకోకు అది ఓ ఆటంకం అని కూడా అనుకోకు... కోర్టుకెళ్ళు.. ప్రాక్టీసు చెయ్యి... అలా చెయ్యలేదనుకో, నీ జన్మకే అవమానం అనుకో..."

నిశ్శబ్దంగా, జవాబు చెప్పకుండా, పేపర్లని చూడసాగాడు సుబ్రమణ్యం.

"తాతగారు బావుంది దీని సంగతి నేను చూస్తాను. ముందు ఫోన్లో మాట్లాడి, తర్వాత స్వయంగా రాజమండ్రి వెళ్ళి ఇచ్చివస్తాను..." అని వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత సుబ్రమణ్యం వచ్చాడు.

"శుభవార్త తెచ్చాను. పబ్లిషర్ మీ చేతిరాత ప్రతిని చూసి, పైపైన చదివి, చాలా సంతోషపడ్డారు. ఇలాంటి పుస్తకాలు సమాజానికి, సాహితీ ప్రపంచానికి కావాలి. తప్పకుండా ముద్రిస్తాం. అన్ని హక్కులు మాకే అని ఓ ఉత్తరం రాసి ఇచ్చారు. పైగా ఓ రెండు వేలు అడ్వాన్సుగా కూడా ఇచ్చారు" అంటూ ఓ ఉత్తరం, రెండు వేల రూపాయలు ఆయన చేతిలో ఉంచాడు.

తాతగారు వెంటనే మునిమనవల్ని రప్పించారు.

"నేను ఎవరికీ బరువుకాను, నాకు ఆ పసివాళ్ళు బరువుకారు. ఈ వయసులో వాళ్ళని నేను చూడగలను..." అప్పుడే, కావేసర్రావు వెళ్తూంటే ఆపించి రెండు పూటలా కారీర్ తెచ్చే ఏర్పాటు చేయించారు.

కావేసర్రావు, ఆ గ్రామంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా, తక్షణం ఆదుకుంటాడు.

తాతగారికి ఆ తర్వాత నెల కూడా రెండు వేలు తెచ్చి ఇచ్చాడు సుబ్రమణ్యం.

సుభద్ర తండ్రి పోయారు. పధ్నాలుగు రోజులు అయ్యాక సింహాద్రితో కలిసి వచ్చింది.

తాతగారు ఆ రోజున లేవలేకపోయారు.

డాక్టర్ని పిలిచారు.

"పూర్ణాయుష్షు పోసుకున్న మనిషి. అధికమాసాల్తో నూరేళ్ళు ఉన్నాయని అంటున్నారు. ఇంక ఈ కాయం ఇంతే. మెల్లిగా... మెల్లిగా... రోజులు లెక్కపెట్టున్నారు. అది మీరంతా అంగీకరించాలి..."

"సింహాద్రి, సుబ్బరమణ్యాన్ని కేకేసుకురా..." తాతగారు నీరసంగా అన్నారు.

సుబ్రమణ్యం రెక్కలు కట్టుకుని వచ్చాడు.

ఆనవాలు కట్టలేకపోయారు, సుబ్రమణ్యాన్ని.

"నేను, సుబ్రమణ్యాన్ని...." అని చేత్తో తట్టి చెప్పాడు.

"వచ్చావా! సుబ్బూ... నాకు పిలుపు వచ్చినట్లే. ఈ హంస వెళ్ళిపోయేలోగా, రాజమండ్రి వెళ్ళి, ఒక్కసారి పుస్తకం గురించి కనుక్కుంటావా! ఆ పుస్తకం చూడాలిరా... అంతవరకూ బతికే ఉంటాను లే..." నవ్వబోయారు.

హామీ ఇస్తున్నట్లుగా అతని చేయి నొక్కాడు.

"అలాగే.. పుస్తకం తెచ్చే పూచి నాది. ఇదిగో ఈ పళంగా వెళ్ళి, ఇక్కడున్నట్లుగా తిరిగొస్తాను..."

అన్నట్లుగానే సాయంత్రానికల్లా శుభవార్త మోసుకువచ్చాడు.

"పుస్తకం పూర్తయిపోయింది. మీరు కోరినట్లుగా రాజమండ్రి చిత్రకారులతోనే బొమ్మలు వేయించారుట. చాలా బాగున్నాయి. రేపు వచ్చి పుస్తకం మొదటి కాపీ తీసుకెళ్ళవచ్చన్నారు..."

ఆయన మొహంలోని ఆనందం, కించిత్తు గర్వం ఆ చుట్టూ ఉన్న అందరికీ కనిపించింది.

ఆయనలోని జీవి దారం పోగుకన్నా సన్నం అయిపోయింది. ఏ క్షణంలో నయినా పుటుక్కుమనేట్లుగా ఉంది.

పుస్తకం చేతికొచ్చేవరకూ ఆయన ఉంటారో లేదో అన్న బెంగ ఆ గ్రామంలోని వాళ్ళందరికీ కలిగింది.

మగత మగతగానే తాతగారు రాత్రి గడిపారు.

ఆ మర్నాడు బాగా ఎండెక్కాక సుబ్రమణ్యం పుస్తకంతో వచ్చాడు. ఆ క్షణం కోసమే చూస్తున్న అందరూ సుబ్రమణ్యంతో సహా తాతగారి మంచం చుట్టూ చేరారు.

లావుగా, చాలా పేజీల్తో, ఎర్రటి మందపాటి అట్టతో ఉన్న పుస్తకాన్ని అంతా చూసి ఆనందించారు. ఎర్రటి అట్టమీద, బంగారు రంగులో అక్షరాలు, చెక్కినట్లుగా పైకి ఉబికి ఉన్నాయి. వెయ్యేళ్ళ ప్రస్థానం అని రాసి ఉంది.

"తాతగారూ... ఇదిగో.. మీ పుస్తకం..." కుదిపి, కుదిపి ఆయన గుండెల మీదుంచి, కుడిచేతిని ఆ పుస్తకం మీదుంచాడు.

మూసుకున్న రెప్పలకింద కనుగుడ్ల కదలిక, చేతివేళ్ళల్లో చలనం.

అందరూ హిచ్‌కాక్ సినిమా చూస్తున్నట్లుగా, ఆత్రుతగా ఆయన్నే గమనిస్తున్నారు.

మెల్లగా, పుస్తకాన్ని తడిమారు. అట్టని చూపుడు వేలు మధ్యవేలుతో రాశారు. వేళ్ళు కదిలించి పేరుని స్పృశించి చదివారు. కనీ కనపడని బోసినవ్వు... కళ్ళరెప్పల కింద రెండు ఆనంద బాష్పాలు.

"ఏ పనైనా ఏ వయసులోనైనా మొదలెట్టచ్చు. వయసు పెద్ద ఆటంకం కాదు. నేను ఎవరికీ బరువు కాలేదు... కాను..."

పెదవులు కదిలాయి.

స్పష్టత లేకపోయినా, ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆయన మంచం చుట్టూ ఉన్నవాళ్ళకి అలా వినిపించింది.

మరో రెండుగంటలకి, ఆ వెయ్యేళ్ళ ప్రస్థానం తాతగారి జీవంలేని ఆ చేతులకింద ఉంది.

తాతగారి స్థితిని అర్థం చేసుకుని, మనవడు సింహాద్రి, మెల్లిగా, ఆ పుస్తకాన్ని తీశాడు. అప్పుడు సుభద్ర పక్కనే ఉంది. ఆ పుస్తకాన్ని, దాని మీద ఉన్న అట్టని మరోసారి చూసి సుభద్రకి చూపించాడు.

తాతగారు అప్పుడే పోరని, గ్రామంలో వాళ్ళంతా ఇళ్ళకి వెళ్ళిపోయారు. సుబ్రమణ్యం మాత్రం మండువాకి ఉన్న చెక్క స్తంభానికి కుడి భుజాన్ని ఆనించి, చేతులు కట్టుకుని నుంచున్నాడు.

సింహాద్రి పై అట్టని మరోసారి చూసి, అట్టని మెల్లిగా తిప్పాడు. రెండో పేజి, ఆ తర్వాత మూడో పేజీ, వెంటనే గబగబా పేజీలన్నీ తిప్పాడు.

ఆశ్చర్యంగా, అయోమయంగా సుబ్రమణ్యం కేసి చూశారు.

"సుబ్బూ..." తీవ్రంగా అన్నాడు సింహాద్రి.

సుబ్రమణ్యం తల దించుకున్నాడు.

"ఏవిటిదీ! లోపల పేజీల్లో ఏవీ లేదేం! ఇదో తెల్లకాయితాల పుస్తకంలా ఉంది. ఆయన రాసిన ప్రస్థానంలా లేదు..."

సుబ్రమణ్యం మెల్లిగా తలని, కళ్ళని ఎత్తి సింహాద్రి వైపు చూశాడు.

"ఉరే – సింహాద్రి... నువ్వు నన్ను క్షమించాలిరా.. నిజానికి పుస్తకం లేనే లేదు..."

"అంటే... ఈ నాలుగు నెల్లనుంచి ఆయన్ని అలా మభ్యపెట్టావేం? నూరేళ్ళు నిండిన మనిషిని మోసం చేశానని నీకనిపించలేదా!"

మరుక్షణంలోనే సుబ్రమణ్యం భుజాన ఉన్న సంచీలోంచి తాతగారి కాయితాల బొత్తిని తీసి చూపించాడు.

సింహాద్రి ఆశ్చర్యంగా ఆ వ్రాత ప్రతిని చూపాడు.

మొదట్లో అది తెలుగేనా మరేదయినా భాషా అనిపించింది. బాగా పట్టి పట్టి చూస్తే అర్థం అయింది. అది తెలుగే! అవి తెలుగు పదాలే! అన్నీ గీతలూ జిలేబీ చుట్టల్లా చుట్టుకున్న అక్షరాలు. ఏదో తవ్వకాల్లో దొరికిన శాసనాలమీద ఉన్న అక్షరాల్లా ఉన్నాయి.

"నేను నీలాగే ఆశ్చర్యపోయాను ఈ అక్షరాలని చూసి. పెన్నుని పట్టుకునే పట్టు ఆయన చేతుల్లో లేదు. చూపు బాగా మందగించింది. అక్షరాలన్నీ కింద మీద,

ఎగుడు దిగుడుగా ఉన్నాయి. రాస్తున్నప్పుడు ఒక్కొక్కసారి పేపరు కదిలిపోయినట్లుంది. అక్షరాలన్నీ ఒకచోట మొదలయి ఇంకో మూలకి వెళ్ళిపోయాయి..." అన్నాడు మెల్లిగా.

"అయ్యో... మరి అలాంటప్పుడు పుస్తకం వేయిస్తానని ఎందుకన్నావ్?"

"నిండు నూరేళ్ళు పూర్తి చేసుకున్న, అంత పెద్ద మనిషిని బాధపెట్టడం ఇష్టం లేక, ఆయన బోర్ కొట్టకుండ పుస్తకం రాస్తున్నా అన్న కోరికని కాదనలేక, ఆయన ఆశని చంపలేక, ఓ చిన్న అబద్ధంతో, ఆయనకి తృప్తి కలిగించాలని అనుకున్నాను. అంతే... కానీ..."

సింహాద్రి గుండె బరువెక్కింది....

"మరి... రాజమండ్రి, పబ్లిషర్, హక్కులు కొనుక్కున్న ఉత్తరం, అన్నింటికీ మించి నెల నెలా డబ్బు.. అది... అదెక్కడిదీ?"

నిశ్శబ్దం....

ఆయన వెయ్యేళ్ళ ప్రస్థానం ముగింపు ఆ నిశ్శబ్దంలో కనిపించింది.

"ఆయనకు డబ్బు ఎలాగైనా ఇవ్వాలన్న ఉద్దేశంతో, నాకు తెలీకుండానే తాగుడు మానేశాను. చిన్న చిన్న కేసులు టేకప్ చేస్తూ ప్రాక్టీసు మొదలు పెట్టాను. నన్ను మార్చిన ఆయన రాసిన పుస్తకం కోసం నేనిచ్చుకున్న మూల్యం అది... అది చాలా తక్కువే... కానీ, నా దగ్గర అప్పుడంతే ఉంది..."

నలిగిన బట్టల్లో, పొట్టిగా ఉన్న సుబ్రమణ్యం అందనంత ఎత్తులో ఉన్నట్లనిపించింది సింహాద్రికి.

*నవ్య వారపత్రిక, 27 జనవరి 2010*